## క్లుప్తంగా

### కొనసాగుతున్న ఉత్సవాలు



ఊరేగింపులో పాల్గొని భక్తిని చాటుతున్న మహిళలు

కొత్తూరు: మండల పరిధిలోని గూడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీ విశ్వేశ్వర ఆలయ ప్రారంభోత్సవ ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత దేవతామూర్తుల విగ్రహాలను ఆలంకరణ లేకుండా ఊరేగించారు. స్థానికులతో పాటు సమీప గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

పశువైద్యాధికారి డాక్టర్ స్రవంతి



మేకలకు మందులను తాగిస్తున్న డాక్టర్ స్రవంతి

షాబాద్: వాధ్యుల నుంచి జీవాలను కాపాడుకుందామని షాబాద్ పశువైద్యాధికారి డాక్టర్ స్రవంతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కుర్వగూడ, బోడంపహాడ్, మాచన్‌పల్లి, అంతిరెడ్డిగూడ గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలకు ఏడాదికి మూడుసార్లు నట్టల మందులను తాపించాలన్నారు. జీవాలకు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులున్నారు.

### చెట్లతోనే మానవ మనుగడ

తహసీల్దార్ అశోక్‌కుమార్



మొక్క నాటుతున్న తహసీల్దార్ అశోక్‌కుమార్, తదితరులు

మొయినాబాద్: మానవ మనుగడకు చెట్లే ప్రధానమని మొయినాబాద్ తహసీల్దార్ అశోక్ కుమార్ అన్నారు. తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్(టీఎస్ఎస్ఓ) ఆధ్వర్యంలో మొయినాబాద్‌లో సోమవారం అనంత కోటి వృక్ష మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వనాలను పెంచాలన్నారు. విద్యార్థి దశ నుంచి సామాజిక స్పృహను అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్, సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, రవీంద్ర, అమితేజ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

### ఆయుష్మాన్ భారత్ కార్డులతో ప్రయోజనం

బీజేపీ నాయకుడు ఆనంద్‌కుమార్



ఆయుష్మాన్ భారత్ కార్డులను అందిస్తున్న ఆనంద్‌కుమార్

కేశంపేట: ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను అర్హులైన ప్రతి ఒక్కరూ తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు పట్లోల ఆనంద్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో సోమవారం గ్రామస్తులకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డు ఉండడం వల్ల ఆస్పత్రి ఖర్చులకు రూ. 5లక్షల వరకు ఉచితంగా చికిత్స పొందవచ్చని ఆయన అన్నారు. 1400ల రకాల రోగాలకు కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్సలను అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శివకుమార్, మంద వెంకటయ్య, రామోజీ, భూపాల్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, అంజయ్య, కుమార్, శ్రీను, అశోక్, బాలయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### బహిరంగ సభను జయప్రదం చేయండి

కొందుర్గు: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మంగళవారం ఏర్పాటు చేయనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాయికంటి గోపాల్ సోమవారం ప్రకటనలో కోరారు. అన్ని గ్రామాల కార్మికులు ఈ సభకు హాజరు కావాలని కోరారు.

# వైజ్ఞానిక ప్రదర్శనలతో నైపుణ్యం మెరుగు

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచుతాయని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని కాకతీయ పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక మేళాను ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే వారి సృజనాత్మకతకు పదును పెట్టేలా అవగాహన కల్పిస్తూ కొత్త ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సహించడం మంచిదన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభా పాటవాలు వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు వేదికగా నిలుస్తాయని చెప్పారు. విద్యార్థుల తమ ఆలోచనలకు మరింత పదును పెట్టాలన్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. తల్లిదండ్రులు, గురువులు కన్న కలలను విద్యార్థులు సాకారం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం స్వామి, కోఆప్షన్ సభ్యుడు ఒగ్గుకిషోర్, నాయకులు నర్సింహ, శంకర్, లక్ష్మణ్‌నాయక్, యాదగిరియాదవ్, శరత్‌కృష్ణ పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న ఎమ్మెల్యే

**బీఆర్‌ఎస్‌తోనే సబ్బండవర్గాల అభివృద్ధి**

కేశంపేట: బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రంలోని సబ్బండవర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన ఎండీ సాధిఖ్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతడిది నిరుపేద కుటుంబం కావడంతో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను సహాయం కోరగా సీఎం సహాయనిధి నుంచి లక్ష రూపాయాల చెక్కును మంజూరు చేయించారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలను చాలా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని అన్నారు. సంక్షేమ పథకాలను నేరుగా అర్హులైన లబ్ధిదారులకే అందుతున్నాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, అంజిరెడ్డి, వెంకటయ్య, తోట వెంకటేష్, మధుసూదన్‌రెడ్డి, నిరంజన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

# ప్రజా సమస్యలు పట్టని బీఆర్‌ఎస్ ప్రభుత్వం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

మొయినాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఆదివారం రాత్రి శ్రీరాంనగర్ సర్పంచ్ నస్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'ప్రజా గోస-బీజేపీ భరోసా' పేరుతో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా తన కుటుంబ అభివృద్ధిపై దృష్టి పెట్టారన్నారు. గ్రామాల్లో రోడ్లన్నీ గుంతలుగా మారినా అభివృద్ధికి నోచుకోవడం లేదని.. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో పనులు చేసుకుంటూ కేంద్రం నిధులే ఇవ్వడంలేదని కేసీఆర్ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. 9 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని.. రాబోయే రోజుల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కేంద్ర పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కంజర్ల ప్రకాష్, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, పద్మనాభం, నర్సింహ్మరెడ్డి, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేందర్, నాయకులు సుధాకర్‌రెడ్డి, మహిపాల్, మల్లారెడ్డి, శివారెడ్డి, రఘు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

### 2 నుంచి బండ మల్లన్న జాతర

నందిగామ: మండల పరిధిలోని దేవుని మామిడిపల్లిలో బండ మల్లన్న దేవాలయ జాతర మార్చి 2 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2వ తేదీన గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, మండపారాధన, హోమం, జలాధివాసం, ధాన్యదివానం, పుష్పాదివాసం, శయ్యదవానం, 3వ తేదీన గర్తన్యాసం, బీజాధిస్థాపన, యంత్ర స్థాపన, ధ్వజ ప్రతిష్ఠ, పూర్ణాహుతి,4వ తేదీన మల్లన్న దేవుడి ఊరేగింపు రాత్రి 12 గంటలకు అగ్నిగుండాలు, 5వ తేదీన అభిషేకం, స్వామి వారి కళ్యాణం,6వ తేదీన సత్యనారాయణ స్వామి వ్రతం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్



ట్రోఫీ అందుకున్న బిన్నీ మిల్స్ జట్టు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని హాజిపల్లి రోడ్డులో గౌరీ గార్డెన్ వెనక మైదానంలో గత మూడు రోజులుగా నిర్వహించిన మూడవ గ్రామీణ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో షాద్‌నగర్ బిన్నీ మిల్స్ జట్టు, మక్త వెంకటపూర్ జట్టు తలపడ్డాయి. హోరా హోరీగా జరిగిన మ్యాచ్‌లో బిన్నీ మిల్స్ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు విజేత జట్టుకు రూ.30వేల నగదుతో పాటుగా ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ.20వేల నగదు, ట్రోఫీని అందజేశారు.ఈ టోర్నమెంట్‌లో ఉత్తమ క్రీడాకారులుగా ఉస్మాన్, ఎత్తీషాం, విజయ్, నజీర్, సద్దాంలు ఎంపికయ్యారు.

### రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులివ్వండి

యాచారం: గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.కోటి నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి కొత్తపల్లి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామ సర్పంచ్ హబీబుద్దీన్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు సోమవారం ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

# గడపగడపకూ బీఆర్‌ఎస్ వైఫల్యాలు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి

బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి

నందిగామ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను గడపగడపకూ తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని బీజేపీ సీనియర్ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రంగాపూర్‌లో ఆదివారం రాత్రి శక్తి కేంద్రం ఇన్‌చార్జి మోహన్‌సింగ్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా గోస-బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు ఆ పార్టీ సీనియర్ నాయకుడు విష్ణువరన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ అవినీతి పాలనను అంతమొందించే వరకు ప్రతి కార్యకర్త విశ్రమించొద్దన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్‌ఎస్ పేరుతో రాజకీయ డ్రామాలకు తెరలేపాడని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుధాకర్‌తో పాటు పెద్ద ఎత్తున యువకులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మోహన్‌రెడ్డిని సన్మానించి షీల్డ్ బహూకరిస్తున్న విద్యార్థినులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని మమత పాఠశాలలో 2006 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 40 మంది ఓ వ్యవసాయ క్షేత్రంలో సోమవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా మమత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డిని పూర్వ విద్యార్థులు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. దాదాపు 17 సంవత్సరాల అనంతరం కలిసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పాఠశాలలో చదువుకున్న విద్యాబోధనలతో పాటు ఉపాధ్యాయుల పనితీరును నెమరువేసుకున్నారు. ఆ పాఠశాలలో అప్పటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. గురువులు నేర్పిన విద్య, క్రమశిక్షణతోనే విద్యార్థులు ఉన్నతంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. దైవమే గురువుగా భావించి పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో తనను సన్మానించినందుకు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో బల్వంత్‌రెడ్డి, కష్ణ, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి కేంద్రం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

కొందుర్గు: పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని బీజేపీ నేత శ్రీవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల గ్రామంలో సోమవారం నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి తామే చేస్తున్నామని బీఆర్‌ఎస్ గొప్పలు చెబుతుందే కానీ, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు నిధులన్నీ కేంద్ర ప్రభుత్వమే ఇస్తుందన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామని ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రజలను మరోసారి మోసం చేయడానికి సిద్ధమవుతున్నాడని ఆరోపించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించి బిల్లులు అందక 9 మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకోవడం జరిగిందని, ఈ పాపం బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, భూపాలచారి, కుర్మయ్య, శ్రీనివాసు, రామచంద్రయ్య, బీంరాజ్, అనంతయ్య, సురేష్, శేఖర్, హరీష్ పాల్గొన్నారు.

# ఉపాధి హామీతో పేదలకు లబ్ధి

ఎంపీడీఓ వినయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: వలసలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని నిరుపేదలందరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వినయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొండన్నగూడ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. అదే విధంగా పథకానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి హామీ పనులు చేపట్టాలని అన్నారు. ఈ పథకంలో రహదారుల అభివృద్ధి, కాలువలు, చెరువులు, కరువు నివారణ చర్యలు, అడవుల పెంపకం, చెట్ల నాటడం వంటి అనేక రకాల పనులను చేపట్టడం జరుగుతుందని అన్నారు. దీంతో స్థానికంగా కూలీలకు ఉపాధి లభించడంతో పాటుగా వలసలు తగ్గుతాయని, ప్రజల కొనుగోలు శక్తి పెంపొందుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వినయ్‌కుమార్

# కేంద్ర పథకాలను అడ్డుకోవడం విడ్డూరం

కిసాన్ మోర్చా నాయకుడు పాపయ్యగౌడ్

కేశంపేట: కేంద్ర పథకాలను అమలు చేయకుండా ప్రజలు లబ్ధి చెందకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని కిసాన్ మోర్చా జాతీయ జాతీయ కార్యవర్గ సభ్యులు, పాండిచేరి ఇన్‌చార్జి బస్వ పాపయ్యగౌడ్ అన్నారు. జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో రైతు జలదీక్ష అర్ధనగ్న ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపయ్యగౌడ్ మాట్లాడుతూ.. మండలంలో రైతులు అధికంగా ఉన్నారని వారికి లబ్ధి చేకూర్చే విధంగా మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు లబ్ధి చేకూరేలా ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజనా పథకాన్ని అమలు చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయడం లేదని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన రైతు రుణమాఫీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన అన్నారు. రైతు జలదీక్ష అర్ధనగ్న ప్రదర్శన సందర్భంగా నాయకులు జలదీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో మోటే శ్రీనివాసులు, అభిషేక్ యాదవ్, వెంకటేష్‌గౌడ్, శివాజీ, రఘురాంగౌడ్, విఠల్‌గౌడ్, హరికృష్ణ, శేఖర్, గోపాల్‌రెడ్డి, రాఘవేంద్రచారి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శనలో బీజేపీ నాయకులు

# అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య

షాద్‌నగర్: అర్హులైన పేద ప్రజలందరికీ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. చాలా మంది నిరుపేదలు పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తూ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నాయకులు పేద ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని చెప్పారు. చౌదరిగూడలో సర్వే నంబర్ 142, కొందుర్గులో సర్వేనంబర్ 237లోని ప్రభుత్వ భూమిలో పేదలకు పట్టాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని తెలిపారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చౌదరిగూడ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మంజుల, లక్ష్మి, యాదమ్మ, లలిత, రాములమ్మ, యాదమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న జంగయ్య

# ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని శ్రీషిరిడిసాయిబాబా ఆలయ తృతీయ వార్షికోత్సవ పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. చేవెళ్లలోని ఇంద్రారెడ్డినగర్ గ్రామానికి చెందిన భక్తులు, గ్రామపెద్దలు, పూజల్లో పాల్గొన్నారు. ఉదయం కాగడ హారతి, సాయిబాబా అభిషేకం, సాయిబాబా, గణపతి, లక్ష్మీ హోమం, సాయివ్రతం, మధ్యాహ్న హార తి,అన్నదానం,సాయంత్రం భక్తుల కోలాటం, దూపహారతి, లక్షపుష్పర్చన, శేషహారతి పూజలు నిర్వహించారు. సాయిబాబా ఆలయం మండలంలో ఏ ర్పాటు చేయడంతో సాయిబాబా భక్తులు ప్రతి గు రువారం పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారని ఆలయ కమిటీ నిర్వాహకులు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

**పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య**

చేవెళ్లలోని సాయిబాబా ఆలయంలో జరిగిన వార్షికోత్సవ పూజలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, స్థానిక నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఆలయాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం.మాలతి, సర్పంచులు మోహన్‌రెడ్డి, మాధవ్‌రెడ్డి, ప్రభాకర్, జంగారెడ్డి, నర్సింలు, నర్సింహారెడ్డి, మల్లేశ్, క్రిష్ణ, సత్తి, రవీందర్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

# ప్రీతి మృతికి కారణమైన దోషులను వదిలిపెట్టొద్దు



ప్రీతికి నివాళులర్పిస్తున్న స్వేరో స్టూడెంట్ యూనియన్ నాయకులు

ఏబీవీపీ, స్వేరో స్టూడెంట్ యూనియన్ డిమాండ్

చేవెళ్ల: వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ఆత్మహత్యాయత్నానికి యత్నించి ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడిన పీజీ మెడికో విద్యార్థి ప్రీతి చివరికి ప్రాణాలు విడిచిందని ఏబీవీపీ, స్వేరో స్టూడెంట్ యూనియన్ నాయకులు అన్నారు. చేవెళ్లలో సోమవారం ఏబీవీపీ, స్వేరో స్టూడెంట్ యూనియన్ నాయకులు వేర్వేరుగా నిరసనలు తెలిపి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో రోడ్డుపై ర్యాలీ నిర్వహించి రోడ్డుపై దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రీతి ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ ప్రీతి ఆత్మహత్యయత్నం అనంతరం వైద్య విద్యా కళాశాలలో ర్యాగింగ్ సాధారణమని ప్రకటించిన అధికారులను విధులనుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ ప్రీతి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ హాస్టల్ కన్వీనర్ హరిక్రిష్ణ, చేవెళ్ల మండల కార్యదర్శి శివ, భవాని, వెంకటేష్, మహేశ్, స్వేరో స్టూడెంట్ యూనియన్ నాయకులు రఘురామ్,గోవింద్‌సింగ్, గణేశ్, మత్స్య,చందన, మమత, శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

**నిందితుడిని కఠినంగా శిక్షించాలి**

షాద్‌నగర్: ఐదురోజులుగా మృత్యువుతో పోరాడిన కాకతీయ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థిని ప్రీతి మృతికి కారకులైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అందె మోహన్ డిమాండ్ చేశారు. మెడికో విద్యార్థి మృతి పట్ల సోమవారం షాద్‌నగర్ పట్టణంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అందెమోహన్ మాట్లాడుతూ.. ధైర్యం, ప్రశ్నించే తెగువ ఉన్న ప్రీతి చివరికి ఓ సీనియర్ వేధింపులు తాళలేక ప్రాణాలు కోల్పోయిందని అన్నారు. అవమానాన్ని భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకొని అర్ధాంతరంగా తనువు చాలించడం బాధాకరమని చెప్పారు. సీనియర్ విద్యార్థి వేధింపులకు గురి చేస్తున్నారని కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా సరైన రీతిలో స్పందించలేదని అన్నారు. కళాశాలల్లో ర్యాగింగ్, వేధింపులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఖదీర్, ముబారక్ అలీ, అర్జున్ లక్ష్మణ్, భాస్కర్, జాఫర్, ప్రదీప్, అనిల్, గణేష్ నాయక్, రహమాన్, రాజు, సాయి, వంశీ, మోహన్, ఆకాష్, తేజ పాల్గొన్నారు.



ధర్నా నిర్వహించిన యువజన కాంగ్రెస్ నేతలు